సాక్షి సిద్దిపేట

సోమవారం । 20 । నవంబర్ । 2023



సదర్ వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు



సదర్‌లో దున్నపోతు విన్యాసం

సదర్ సంబురం

యాదవ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో సదర్ సంబరాలు ఘనంగా జరిగాయి. స్థానిక హనుమాన్ దేవాలయం, క్లాక్ టవర్(కోర్ట్)వద్ద హర్యానా దున్నపోతులతో సదర్ నిర్వహించారు. హైదరాబాద్ లాంటి ప్రాంతానికి పరిమితమైన సదర్ తొలిసారిగా సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున యాదవులు, పట్టణ ప్రజలు తరలివచ్చారు. మంత్రి హరీశ్‌రావు ఉత్సవాల్లో పాల్గొన్నారు. యాదవుల గొప్ప పండుగగా మంత్రి అభివర్ణించారు. ఇది ప్రారంభమని, ప్రతి ఏటా సిద్దిపేటలో సదర్ నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఈ సదర్‌లో శ్రీకష్ణ అనే దున్న విలువ రూ.10 కోట్లు ఉండటం విశేషం. - సిద్దిపేటజోన్

న్యూస్‌రీల్

కాంగ్రెస్ వస్తే కష్టాలే..

బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మ



సికింద్లాపూర్‌లో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందిస్తున్న స్థానికులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ వస్తే కష్టాలు.. నష్టాలు తప్పవని, అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలిపిన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారం, సికింద్లాపూర్, కస్తూరిపల్లిలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు లభిస్తాయని ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ వనిత, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు ఉన్నారు. పలు కుల సంఘాలు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపాయి.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు చెల్లించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో పర్వతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీలు కావాలన్నారు. అదేవిధంగా పండిట్, పీఈటీ పోస్టులు అప్‌డేట్ చేసి న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరించాలన్నారు. పాఠశాలలో పేరుకుపోయిన సమస్యల పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, ప్రధాన కార్యదర్శి మట్టపల్లి రంగారావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాబెర్ అలీ, కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు మ్యాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడారం వాసికి ఐరావతం అవార్డు



ఆనందం పంతులు దంపతులకు సన్మానం

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన వాస్తు, జ్యోతిష్య పండితులు కటుకోజ్వల ఆనందం పంతులుకు ఐరావతం అవార్డు వరించింది. పోలా ప్రగడ కళానిలయం వారు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో సాహిత్యంలో రాణిస్తున్న ఆనందం పంతులను అవార్డుతో పాటు ఘనంగా సన్మానించారు. పలువురు సాహితీ వెత్తలు అభినందించి సన్మానించారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ



మాట్లాడుతున్న హరికృష్ణ

చిన్నకోదూరు(సిద్దిపేట): మాయమాటలతో గద్దెనెక్కిన బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పి, తెలంగాణ ప్రకటించిన కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆ పార్టీ సిద్దిపేట అభ్యర్థి పూజల హరికృష్ణ కోరారు. ఆదివారం మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సిద్దిపేట బిడ్డగా ఒకసారి అవకాశం ఇవ్వాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గోపికృష్ణ, కలీమొద్దిన్, శ్రీనివాస్‌రెడ్డి, అజ్జు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతటా ఆత్మీయం రంజుగా రాజకీయం

ఆత్మీయ సమ్మేళనాల జోరు

- మిన్నంటిన ప్రచార హోరు
- వివిధ వర్గాల మద్దతుకు పార్టీల ప్రయత్నాలు
- గజ్వేల్ నియోజకవర్గంలో పోరు ఆసక్తికరం

గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రచార పర్వం కీలక దశకు చేరుకున్నది. పోలింగ్ సమీపిస్తుండటంతో అన్ని వర్గాలను ఆకర్షించడానికి పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ మద్దతు కోరుతున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ బీఆర్‌ఎస్ దూకుడుగా ముందుకువెళ్తోంది. బీజేపీ, కాంగ్రెస్ సైతం ఓటర్లను ఆకర్షిస్తూనే అన్ని వర్గాలను తమవైపు తిప్పుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.



గజ్వేల్: నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న కేసీఆర్‌కు భారీ మెజారిటీని అందించడానికి బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. కేసీఆర్ రాష్ట్రమంతటా పర్యటిస్తున్న క్రమంలో ఆయన గెలుపు బాధ్యతను పార్టీ యంత్రాంగం భుజస్కందాలపై వేసుకున్నది. ఎలాగైనా కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించడానికి శ్రేణులు పనిచేస్తున్నాయి. పని విభజన చేసుకుంటూ నేతలు ముందుకు సాగుతున్నారు. ఈ నియోజకవర్గానికి మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీ అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయనతోపాటు ఇతర ముఖ్య నేతలు సైతం నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, కుకునూర్‌పల్లి, మర్కూక్, ములుగు, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. అతి తక్కువ వ్యవధిలో ఎక్కువ మంది ఓటర్లను కలిసేందుకు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే సుమారుగా 40వర్గాలతో అధికార పార్టీ నేతలు సమ్మేళనాలను నిర్వహించారు. ఈ క్రమంలోనే భూనిర్వాసితులు, దివ్యాంగులు, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు, వైశ్యులు, కెమిస్ట్, డ్రగ్గిస్ట్ తదితర సమ్మేళనాలకు మంత్రి హరీశ్‌రావు హాజరై వారి మద్దతును కోరారు. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం తర్వాత గజ్వేల్‌లో వచ్చిన మార్పును వివరిస్తూ.. ఈ అభివృద్ధి ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలంటే కేసీఆర్‌కు భారీ మెజారిటీ ఇవ్వాలని కోరుతున్నారు. మరికొన్ని ముఖ్యమైన వర్గాల ఆత్మీయ సమ్మేళనాలను సైతం నిర్వహించడానికి అధికార పార్టీ సిద్ధమవుతోంది.

ఈటల సైతం..

బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ సైతం ఇక్కడ వివిధ వర్గాలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో అసంతృప్తిగా ద్వితీయశ్రేణి నాయకులను తనవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో బలంగా ఉన్న వర్గాలను గుర్తించి ప్రత్యేక సమావేశాలను నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని వర్గాలను కలిశారు. గతంలో టీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా ఉండి ప్రస్తుతం స్తబ్దుగా ఉన్న నేతలను కలిసి వారి మద్దతును కోరుతున్నారు. అంతేకాకుండా బీసీ నినాదాన్ని ప్రచారంలో బలంగా వాడుతున్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ నేతలు చూపుతున్న నిర్లక్ష్యాన్ని తనదైన శైలిలో ఎండగడుతున్నారు.

స్థానిక నినాదాన్ని నమ్ముకుని..

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి మాత్రం స్థానిక నినాదాన్ని నమ్ముకొని ఎన్నికల రంగంలోకి దిగారు. తన ప్రచారంలో ప్రతి చోట ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. పార్టీల ప్రయత్నాలు నడుమ గజ్వేల్ ఎన్నికల ప్రచార పర్వం ఆసక్తికరంగా మారింది.

కర్ణాటక పరిస్థితి మనకొద్దు

- అద్భుతమైన మేనిఫెస్టో బీఆర్‌ఎస్‌ది
- రాష్ట్రం అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌దే
- మంత్రి హరీశ్‌రావు



కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: గూట్లో రాయి తీయలేనోడు.. ఏట్లోని రాయి తీస్తాడా అన్నట్టు కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందని, కర్ణాటకలో మూడు గంటల కరెంట్ ఇస్తున్నారని, అలాంటి పరిస్థితి మనకు వద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా పలు సంఘాలు మంత్రికి మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్ణాటక రైతులు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామా అని బాధ పడుతున్నారని అన్నారు. వ్యవసాయం కోసం 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. అద్భుతమైన మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ ప్రకటించిందన్నారు. రైతు బీమా తరహాలో త్వరలో అందరికీ ఐదు లక్షల బీమా అందిస్తుందని, రేషన్ ద్వారా సన్న బియ్యం రానుందని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణలో అన్ని రంగాల్లో మార్పు వచ్చిందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను గూర్చి వివరించాలని, మీరే బ్రాండ్ అంబాసిడర్లు కావాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. భవిష్యత్తులో డిగ్రీ స్థాయిలో గురుకుల వ్యవస్థ అమలు చేస్తామని తెలిపారు. బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరారు.

21 సంఘాలు తీర్మానం..

మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా 21 సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవ తీర్మాన పత్రాలు అందించారు. అంతకుముందు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, శివ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్ రావు కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలకలను సరిదిద్దుకోవడం గొప్ప విషయం

కొండపాక(గజ్వేల్): రాజకీయ అలకలను సరిదిద్దుకోవడం గొప్ప విషయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీజేపీకి చెందిన కుకునూరుపల్లి మండలం తిప్పారం సర్పంచ్ కర్నె లక్ష్మి, ఎల్లాయిగూడెం సర్పంచ్ రాములు ఆదివారం మంత్రిసమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముంపు బాధితుల సమస్యలు ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీర్చే బాధ్యత తనదంటూ భరోసా నిచ్చారు. రాజకీయ పరంగా అలకలు ఉన్నంత మాత్రాన ప్రజా ప్రతినిధులను ప్రలోభాలకు గురి చేస్తూ కాంగ్రెస్, బీజేపీల్లో చేర్చుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, వైస్ ఎంపీపీ సోమి భగవంతయ్య, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, నాయకులు గొట్టం గోపాల్‌రెడ్డి, కోల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి జనరల్ అబ్జర్వర్లు జయశ్రీ భోజ్, మన్మోహన్‌ప్రసాద్ సందర్శించారు. నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్ల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు ఉంచడానికి ఐరన్ ర్యాక్‌లు, సీసీ కెమెరాలు, కౌంటింగ్ కేంద్రాలలో ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్ల బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని, రోజు పనులను పర్యవేక్షించాలని ఆర్వోలకు సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలించడానికి, స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.





ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల సందడి, (ఇన్‌సెట్) స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కొమురవెల్లి.. భక్తితో ప్రణమిల్లి

కొమురవెల్లి మల్లికార్జున ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ పరిసరాలు పులకరించాయి. కార్తీక మాసంలో మొదటి వారం కావడంతో భక్తులు ఆలయానికి వచ్చి గంగిరేణు చెట్టు ప్రాంగణంలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- కొమురవెల్లి(సిద్దిపేట)





నాచగిరిలో భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు, (ఇన్‌సెట్) వ్రతమాచరిస్తున్న భక్తులు

నాచగిరి.. ఆధ్యాత్మిక ఝరి

నాచగిరి భక్తులతో పోటెత్తింది. ఆదివారం సత్యనారాయణస్వామి వ్రతాలతో కార్తీక శోభను సంతరించుకున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా 90 సామూహిక వ్రతాలు కొనసాగాయి. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు నాచగిరి లక్ష్మీనరసింహస్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఓవైపు వ్రతాలు, మరోవైపు గోవిందనామాలతో క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

- వర్గల్(గజ్వేల్)

ఆరు నెలల్లో మెగా డీఎస్సీ



జనగామ: కరపత్రం ఇచ్చి ప్రచారం చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ప్రతాప్‌రెడ్డి

- అధికారంలోకి రాగానే మేనిఫెస్టో హామీలన్నీ అమలు చేస్తాం
- బీఆర్‌ఎస్ అవినీతి, నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారు
- కాంగ్రెస్ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



చేర్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రియాంకరెడ్డి



బండనాగారం ప్రచారంలో కొమ్మూరి అరుణ

జనగామ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువతకు బహుమానంగా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం జనగామ పట్టణ పరిధి 7, 8, 9 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఆయనకు పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు వివరిస్తూ.. బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం.. పోటీ పరీక్షల నిర్వహణలో పేపర్ల లీకేజీ నిరుద్యోగ యువతీ యువకులను కుంగదీసిందన్నారు. ప్రజాసంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పనలో కేసీఆర్ సర్కారు విఫలమైందన్నారు. అహంకారపూరిత నిరంకుశ, అవినీతి, అక్రమాల పదేళ్ల పాలనలో విసుగు చెందిన అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. అంతకు ముందు తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన పలు పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచ రాములు, చారబుడ్ల దయాకర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, ముస్త్యాల చందర్, వంగాల కల్యాణిమల్లారెడ్డి, జమాల్ షరీఫ్, ఎండీ.గౌస్, తోట సత్యం, ఎండీ.ముజ్జు, తాటి కనుకస్వామి, మునిబేగం, కడారు ప్రవీణ్, దిలీప్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని కేరళ పార్లమెంట్ సభ్యుడు కొడిక్కునిల్ సురేష్ అన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో కొమ్మూరితో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ సర్కారు మైనార్టీల అభివృద్ధి విస్మరించిందని, ముస్లింల సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి ఉంటుందని చెప్పారు. అనంతరం సురేష్‌ను ఘనంగా సత్కరించారు. కాజీపేట దర్గా పీఠాధిపతి మౌలానా కుసుర్ పాషా, వరంగల్ జమీత్ ఉల్మా అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ సత్తార్, హైదరాబాద్ నవాబ్ ముజాహిద్ అలీఖాన్, మౌలానా సాబీర్‌సాబ్, హైకోర్టు అడ్వకేట్, ఆల్ ఇండియా ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఎండీ.షకీల్, స్థానిక ప్రతినిధులు ఎండీ.అన్వర్, ఎంబీ.జమాల్ షరీఫ్, మౌలానా అబ్దుల్ హఫీజ్, సాధిక్ అలీ, ఖదీర్, అజహరొద్దీన్, గౌస్, ముజ్జు, ఖాదర్ షరీఫ్, ఇస్మాయిల్, ముస్తఫా, ఆసిఫ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తాం : అరుణ

బచ్చన్నపేట: ప్రతాప్‌రెడ్డిని ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన సతీమణి కొమ్మూరి అరుణ అన్నారు. బండనాగారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆప్యాయంగా పలుకరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ప్రతాప్‌రెడ్డి జెడ్పీటీసీగా పనిచేసి పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని, కరువును తీర్చడానికి వైఎస్సార్ హయాంలో గోదావరి జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. అవగాహన లేని వ్యక్తులకు ఓటు వేసి అభివృద్ధికి దూరం కావొద్దని సూచించారు. నాయకులు చల్ల సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జంగిలి స్వామి, కొల్ల నర్సిరెడ్డి, రాజలింగం, ఆరేళ్ల భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, రాజేష్‌ఖన్నా, చల్ల సత్యలక్ష్మి, సవాదు నర్సమ్మ, నల్ల పద్మ, నూకల తేజ, కనుకయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల పరిధి పలు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని గడితోట, కర్షకనగర్‌లో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కూతురు ప్రియాంక ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తండ్రిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఉడుముల భాస్కర్‌రెడ్డి, కొమ్ము నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఆకునూరులో కొమ్మూరికి మద్దతుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నీళ్లు, నిధులు నియామకాలతో ఏర్పడిన రాష్ట్రంలో నేడు కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగుతుందని మండిపడ్డారు.

అధికారంలోకి రావడం ఖాయం

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మద్దూరు మండలం మర్మాములలో ప్రజలకు ఆరు గ్యారంటీలను వివరించారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణగౌడ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, భూపతిరెడ్డి, విష్ణు, రాజమల్లయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమురవెల్లి మండలంలోని కొమురవెల్లి, మర్రిముచ్చాల, అయినాపూర్, గురువన్నపేట, కిష్టంపేట, గౌరాయపల్లి గ్రామాల్లో కొమ్మూరి గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు కనుకరాజు, జంగని రవి, కృష్ణారెడ్డి, నర్సింహులు, నవీన్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో ఓటుపై అవగాహన



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'ఓట్' అనే ఆంగ్ల అక్షరాలతో విద్యార్థులు యోగాసనాలు వేసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆదివారం వ్యాసమహర్షి యోగా అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా శిక్షకుడు తోట సతీష్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షేత్ర స్థాయిలో హోమ్ పోలింగ్ పరిశీలన



హోమ్ పోలింగ్ ప్రక్రియను పరిశీస్తున్న మనోహ్మాన్ ప్రసాద్, గరిమా అగర్వాల్

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం హోమ్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. హోమ్ పోలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధుల ఇంటికి వెళ్లి అధికారులు హోమ్ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. చేగుంట, నార్సింగి మండలాల్లో దీనిని దుబ్బాక ఎన్నికల సాధారణ పరిశీలకులు మన్మోహన్ ప్రసాద్‌తో కలిసి ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నియోజక వర్గంలో హోమ్ పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన రితీష్

సిద్దిపేటజోన్: ఎస్జీఎఫ్ అండర్19 జాతీయ స్విమ్మింగ్ పోటీలకు సిద్దిపేట క్రీడాకారుడు రితీష్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ సరూర్ నగర్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో బ్యాక్ స్ట్రోక్ 200 మీటర్ల స్విమ్మింగ్ నందు ద్వితీయ స్థానం సాధించి ఉత్తమ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా కోచ్ ప్రవీణ్, డాక్టర్ మహేష్ అభినందించారు.

ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పట్నం భూపాల్, ప్రధాన కార్యదర్శిగా మ్యాడ శ్రీధర్, ఆర్థిక కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లుగా మట్టపల్లి రంగారావు, మద్దుల రవీందర్‌రెడ్డి, ఖాతా యాదగిరి, రేకులపల్లి లింగారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కుర్తివాడ రాజేందర్, బసవరాజు కనకయ్య, ఉపాధ్యక్షులుగా మొర గణేష్, లభిశెట్టి బిక్షపతి, తాళ్ల శ్రీనివాస్, యూసుఫ్, ముత్తినేని ఎల్లయ్య, అడిషనల్ జనరల్ సెక్రటరీగా నీలం గురువయ్య, జక్కుల చంద్రోశేఖర్, కార్యదర్శులుగా కాల్వ శ్రీకాంత్, మురికి శ్రీనివాస్, రాచకొండ భూపాల్, మంగలిపల్లి శ్రీనివాస్, చిట్టంపల్లి శ్రీనివాస్, ఆర్థిక కమిటీ మెంబర్లుగా శ్రీనాథ్, ఎండి అలం, పోలీస్ యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాబెర్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వ్యవహరించారు. పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత రెడ్డిలు వ్యవహరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824711]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అరచేతిలో ప్రచార జోరు

- సోషల్ మీడియాలో అభ్యర్థుల ఎలక్షన్ వార్
- తెల్లవారక ముందే మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు
- అన్ని పార్టీలది ఇదే దారి..
- ప్రతీ అభ్యర్థికి ప్రత్యేక బృందాలు


నారాయణఖేడ్: శాసనసభ ఎన్నికల ప్రచారం జిల్లాలో ఊపందుకుంది. అభ్యర్థులు విజయం కోసం ఊరూవాడా తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అంతేకాకుండా సోషల్‌మీడియాలో కూడా జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా మనుషులను నియమించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ప్రచార ఫొటోలు, వీడియోలు, తాజా అంశాల సమాచారం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ప్రచారంలో మాట్లాడిన అంశాలను టెక్ట్స్ మెసేజ్‌లు పోస్ట్ చేస్తున్నారు. గతంలో సోషల్‌మీడియా గ్రూప్‌లలో సభ్యుల పరిమితి సంఖ్య కేవలం 250 మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఆ సంఖ్య 1,200 వరకు చేర్చుకునే వెసులుబాటు ఉంది. ఇలా అనేక గ్రూపులను క్రియేట్ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చేరికల విషయాన్ని బిగ్ బ్రేకింగ్ న్యూస్ అంటూ ఫొటోలు, వీడియోలు, మ్యాటర్ ఆకట్టుకునే విధంగా గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలా నిత్యం సెల్‌ఫోన్లలో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంటోంది.

క్షణాల్లో సమాచారం

గతంలో నాయకులు ఎక్కడైనా ప్రచారం చేస్తే మరుసటి రోజు పత్రికలు, టీవీల్లో కనిపించేది. ఇప్పుడు సోషల్ మీడియాను ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నారు. తమ నేతలు ఎక్కడికి వెళితే అక్కడి నుంచే లైవ్ ద్వారా చూపిస్తున్నారు. హార్డ్ వర్క్ కన్నా స్మార్ట్‌వర్క్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ ఫలితం సాధించ వచ్చన్న నానుడి ఎన్నికల సమయంలో సోషల్ మీడియా ద్వారా రుజువు అవుతుంది.

నెట్ డాటా.. చార్జింగ్ ధమాల్..

ఉదయం కోడి కూత కూయక ముందే సెల్‌ఫోన్‌లోని గ్రూపుల్లో వచ్చే మెస్సేజ్ చప్పుళ్ళతో నిద్రలేవాల్సి వస్తుంది. ఆయా గ్రూపుల్లో వందలాది పోస్టులు వస్తున్నాయి. ఓ పక్క నెట్ డాటా ఖర్చు కావడంతోపాటు మరో పక్క చార్జింగ్ ఉండడం లేదని జనాలు వాపోతున్నారు. గ్రూపుల్లో ఒకే అంశంపై పదుల సంఖ్యలో ఫొటోలు పెట్టడం, వాటినే మరొకరు ఫార్వర్డ్ చేస్తుండడంతో విసుగు తెప్పిస్తుందని పేర్కొంటున్నారు. ఎంత విసుగు వచ్చినా ఏదైనా కామెంట్ చేస్తే ఎక్కడ ఏ నాయకుడు ఏమనుకుంటాడో అని సదరు వ్యక్తులు గమ్మున ఉంటూ భరిస్తున్నారు.



జర జాగ్రత్త

సోషల్ మీడియాపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉంచింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడే పోస్టులు పెట్టాలని స్పష్టం చేసింది. ఇందుకు స్వచ్ఛంద నైతిక నియమావళి రూపొందించారు. ఇష్టమొచ్చినట్లు రాతలు రాసి ఫొటోలు పెడితే ఎవరైనా అభ్యంతరం చెబితే ఇరుక్కునే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు, వారి అనుచరులు నియమావళిని ఉల్లంఘించిన వీడియోలు, ఫొటోలను పౌరులు ఎవరైనా ఎన్నికల సంఘానికి పంపించొచ్చు. సి-విజిల్ యాప్‌లో నమోదు చేయవచ్చు. పోస్టులు పెట్టేవారు సంయమనం పాటిస్తూ ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకొని అభ్యంతరకరం లేనివాటినే పోస్టు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగతంగా కించపరిచే పోస్టులకు దూరంగా ఉండాలి. ప్రత్యర్థి పార్టీల నేతలపై దూషణలకు దిగడం చట్టరీత్యా నేరం. తన పరువుకు భంగం కలిగినప్పుడు అవతలి వ్యక్తి పరువు నష్టం దావా వేసే అవకాశం ఉంది. రుజువైతే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు.



అక్కా.. కారుకే ఓటెయ్యాలె

వర్గల్(గజ్వేల్): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఆదివారం వర్గల్ మండలం మైలారంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించడంతోపాటు పంట పొలాల్లో పనిచేసే మహిళల దగ్గరికి వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



ప్రతిపక్షాలను చుట్టేస్తా..

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని పలు కాలనీల్లో ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ఇంటివద్ద బీడీలు చుడుతున్న మహిళలకు వద్దకు వెళ్లారు. కాసేపు వారితో కలిసి బీడీలు చుట్టి.. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు.

పొదుపు డబ్బు స్వాహా..

న్యాయం చేయాలని మహిళల రాస్తారోకో



పందిల్ల రోడ్డు పై ధర్నా చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పందిల్ల స్వకృషి మహిళా పొదుపు సంఘం గణకురాలు సరిత సంఘం డబ్బులు రూ.29 లక్షల వరకు స్వాహా చేసిందని, వాటిని ఇప్పించి న్యాయం చేయాలని మహిళలు ఆదివారం ధర్నా చేశారు. 20ఏళ్ల కిందట స్వకృషి మహిళా పొదుపు సంఘం ఏర్పాటు చేశారు. నెలకు రూ.50 చొప్పున మహిళలు పొదుపు చేసుకుంటున్నారు. వారికి ఎలాంటి జామీను లేకుండా రుణాలు ఇస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణాలను నెలనెలా వాయిదా క్రమంలో చెల్లిస్తున్నారు. అయితే సంఘం గణకురాలు సభ్యులకు తెలవకుండా రూ.29లక్షల వరకు రుణాలు తీసుకుని సొంతానికి వాడుకుందని సభ్యులు ఆరోపించారు. సంఘం ఆడిట్ సమయంలో డబ్బులు స్వాహా అయిన విషయం బయటకు వచ్చింది. వాటిని చెల్లించాలని మహిళలు డిమాండ్ చేయడంతో.. తన పేరు మీదున్న 20 గుంటల వ్యవసాయ భూమి పట్టా చేయిస్తానని ఆమె చెప్పడంతో రాజీకి వచ్చారు. గడువు తీరినా భూమి పట్టా చేయకపోవడంతో సభ్యులందరూ గణకురాలిని నిలదీశారు. డబ్బులు ఇచ్చేది లేదని ఆమె మొండికేయడంతో మహిళలు న్యాయం చేయాలని సిద్దిపేట, హన్మకొండ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆందోళన చేస్తున్న మహిళలకు సర్ది చెప్పి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అభివృద్ధిని చూసి కేసీఆర్‌ను గెలిపించండి



ఇస్లాంపూర్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: అభివృద్ధికి పట్టం కట్టాలని.. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వట్టూరు, నాగులపల్లి, వెంకటరత్నాపూర్, దాతర్‌పల్లి, ఇస్లాంపూర్ గ్రామాలలో జెడ్పీటీసీ రాణి సత్యనారాయణగౌడ్, మాజీ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి విద్యాసాగర్, ఫాక్స్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. అక్కడక్కడా మిగిలి ఉన్న సమస్యలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పెంకుటిళ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడంతో పాటు సీలింగ్, పోరంబోకు భూములకు పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ నిత్యావసరాల ధరలను పెంచి సామాన్యులపై భారం మోపిందన్నారు. నేడు కేసీఆర్‌ను ఓడించేందుకు కుల రాజకీయాలు చేస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. పదేళ్లలో సమస్యల గురించి పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. నేడు అభివృద్ధి చేస్తామంటే ప్రజల నమ్మే స్థితిలో లేరని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఊరూరా కళాకారులు ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుకన్య రమేష్, ఎంపీటీసీ నర్సమ్మ, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు, భిక్షపతి, వెంకట్ రామ్‌రెడ్డి, శ్రీశైలం, రవీందర్‌గౌడ్, హైమాద్ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..



బుదేరాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

బీఆర్ఎస్ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదిస్తే అందోల్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని బుదేరా, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు బుదేరా గ్రామానికి చెందిన పలువురు గులాబీ పార్టీలో చేరారు. అనంతరం చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులను అభివృద్ధి చేయడానికే కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను తెలంగాణలో కేసీఆర్ అమలు చేసి చూపించారన్నారు. వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సాయి కుమార్, విజయ్ కుమార్, భాస్కర్, నవాజ్‌రెడ్డి, మల్లేశం, గోపులారం సిద్దయ్య పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

రాయికోడ్(అందోల్): అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌కే ఓటు వేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని ఎనికెపల్లి గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లకు పైగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఆ పార్టీ అభ్యర్థులకు గెలిపిస్తేనే తిరిగి సంక్షేమ పథకాలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఓరంగ నగర్ సర్పంచ్ నాగరాజ్, సంగారెడ్డి, యాదగిరి, బస్వరాజ్ పాటిల్, శేఖర్‌రెడ్డి, నాగస్‌పల్లి సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, రామన్న పాటిల్, విజయకుమార్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

మునిపల్లి(అందోల్): తెలంగాణ ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి పర్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని మేళసంగ్యం చౌరస్తాలో పలువురు గులాబీ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని, ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. చంటి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కుత్బుద్దీన్, నర్సింలు, నారాయణ, మణెమ్మ పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రగతి కోసం నిరంతర కృషి

మంత్రి హరీశ్ రావు



పాటల సీడీని అవిష్కరిస్తున్న మంత్రి హరీశ్

సిద్దిపేటజోన్: ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ అంటే తనకు చాలా అభిమానమని, తమ్ముడు ఎన్నికల్లో తన కోసం పాట రాసి సీడీ రూపంలో తయారు చేయడం సంతోషంగా ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో హరీశ్ మీద రాహుల్ రూపొందించిన పాట సీడీని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం రాత్రి మంత్రి నివాసంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సిద్దిపేట ఇమేజ్ మెజార్టీ అని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్నింటిలో ఆదర్శంగా ఉన్న సిద్దిపేట మెజార్టీలో టాప్‌గా నిలవాలని కోరారు. శక్తి మేరకు సిద్దిపేట ప్రగతి కోసం పాటుపడతా, పోలింగ్ శాతం పెరగాలి, అందరూ ఓటుహక్కు వినియోగించే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

దుబ్బాకలో బీజేపీ గెలుపు ఖాయం

- వైన్స్ టెండర్లపై ఉన్న ప్రేమ.. కొలువుల నోటిఫికేషన్లపై ఎందుకు లేదు?
- ఒక్క శాతం ఉన్న సీఎం కులానికి ఐదు మంత్రి పదవులా
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



ఎనగుర్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సీఎం కేసీఆర్‌కు వైన్స్ టెండర్లపై ఉన్న ప్రేమ కొలువుల నోటిఫికేషన్లపై ఎందుకు లేదని.. ఇంతటి దుర్మార్గమైన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నామరూపాలు లేకుండా చేయాలని బీజేపీ దుబ్బాక అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాకలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారు బీజేపీలో చేరారు. అలాగే నియోజకవర్గంలోని భూంపల్లి-అక్బర్‌పేట, రాయపోల్ మండలాల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబపాలనకు తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో చరమగీతం పాడటం ఖాయమైందన్నారు. రాష్ట్రంలో ఏం మిగులకుండా దోచుకుతిన్నారని ఆరోపించారు. ఇప్పటికే తాగుబోతుల రాష్ట్రంగా మర్చారని, మళ్లీ గెలిస్తే పేదల భూములు సైతం ఏం మిగుల్చరన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడ వేయలేదని, పెట్టిన పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించకుండా పేపర్లు లీకేజీ చేసి నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒక్క శాతం ఉన్న సీఎం కులానికి ఐదు మంత్రి పదవులా..?

కేసీఆర్ కేబినెట్‌లో కేవలం ఒక్క శాతం ఉన్న తన కులానికి ఐదు మంత్రి పదవులు ఇచ్చి.. 23 శాతం ఉన్న ఎస్సీలకు ఒక్క మంత్రి పదవి ఇచ్చాడని.. ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలకే పంపిణీ చేసుకున్నారని ఆరోపించారు. ప్రజల బాగు కోసమే సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ తో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.

నా గెలుపు ఎప్పుడో ఖాయమైంది

పోరాటాల గడ్డ దుబ్బాక నియోజకవర్గంలో తన గెలుపు ఎప్పుడో ఖాయమైందని.. ఇక భారీ మెజార్టీ కోసమే ప్రచారం చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. 2020 ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌తో సహా మొత్తం కేబినెట్, ఎమ్మెల్యేలు, పోలీసు అధికారులందరూ కలిసి నన్ను ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డారని.. కానీ చైతన్యవంతమైన దుబ్బాక గడ్డ మీద పుట్టిన ప్రజలు నన్ను గెలిపించి తమ పౌరుషాన్ని చూపారన్నారు. మూడేళ్ల తనకు అధికారం ఇస్తే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి పైన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసి నిధులు తెచ్చానని తెలిపారు. రాష్ట్ర ఖజానా అంతా సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లలకే ఖర్చుపెట్టి మిగతా నియోజకవర్గాలకు చాలా అన్యాయం చేశారన్నారు.

హరీశ్‌ను దుబ్బాక ప్రజలు నమ్మరు

హరీశ్‌రావును దుబ్బాక ప్రజలు నమ్మరని.. ట్రబుల్ షూటర్ అని గొప్పలు చెప్పుకునే ఆయనకు ఉప ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని.. మళ్లీ ఓటమి రుచి చూపుతామని రఘునందన్‌రావు అన్నారు. ఉన్న నిధులన్నీ సిద్దిపేటకే తీసుకుపోయి దుబ్బాక నియోజకవర్గానికి తీరని అన్యాయం చేస్తుంది హరీశ్‌రావే అన్నారు. నన్ను ఓడగొట్టేందుకు ఆయన చేస్తున్న కుట్రలు చాలా ఉన్నాయని, ఎన్ని చేసినా ప్రజల మద్దతుతో తిప్పిగొట్టి భారీ మెజార్టీతో గెలుపొందుతానన్నారు.

ఎంపీగా ఉండి దుబ్బాకకు ఏం చేసిండు

రెండు పర్యాయాలు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేసిండో ప్రజలు గమనించాలని రఘునందన్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి జరిగితే తామే చేశామంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభాకర్‌రెడ్డికి ఓట్లేస్తే పరాయి పెత్తనం సాగుతుందని, దుబ్బాక కోసం బరిగీసి కొట్లాడే నన్ను గెలిపించుకుంటే అభివృద్ధితో పాటు ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.

ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా..

దుబ్బాకరూరల్: ఆశీర్వదించి మళ్లీ గెలిపిస్తే దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం భూంపల్లి-అక్బర్‌పేట మండలంలోని చౌదర్‌పల్లి, ఎనగుర్తి, బొప్పాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు కానీ.. విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేయడం చూస్తేనే బీఆర్ఎస్ వైఖరి స్పష్టం అవుతుందన్నారు. ఈ ఎన్నికల్లో దుబ్బాకలో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు.

రాయపోల్ మండలంలో..

రాయపోల్: తన స్వగ్రామం బొప్పాపూర్, రాయపోల్ మండలం టెంకంపేట, బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామాల్లో బోనాలు, బతుకమ్మలు, మంగళహారతులతో మహిళలు తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హరీశ్ దుబ్బాకపై పూర్తిగా కక్షపూరితంగా వ్యవహరిస్తూ నిధులన్నీ సిద్దిపేటకే తరలించుకుపోయి తీరని అన్యాయం చేశాడన్నారు.



బీజేపీలో చేరుతున్న నాయకులు

పొలంపల్లిలో ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండలంలోని పొలంపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు రఘునందన్ రావును గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే డిగ్రీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, వరి క్వింటాలుకు రూ.3100 మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా మాభూమి పోర్టల్ వస్తుందని ప్రచారంలో వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, వేణు, శ్రీకాంత్, రమశ్, ఎల్లం, గణేష్, భూపాల్, కుమ్మరి నర్సింలు, బాలకృష్ణ, స్వామి పాల్గొన్నారు. అనంతరం చేగుంట, మాసాయిపేట మండలాలకు చెందిన 200మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు.

ఏరులై పారుతున్న మద్యం

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పాలనలో వేసిన శిలాఫలకాలకే దిక్కుమొక్కు లేదని రఘునందన్‌రావు విమర్శించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మద్యం ఏరులై పారితే తప్ప పాలన ముందుకు సాగని పరిస్థితి నెలకొందన్నారు. దుబ్బాకలో ఎక్కడ కూడా దళిత బంధు అమలు కాని పరిస్థితి ఉందన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న బీఆర్ఎస్ కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లన్నగారి శాంతవ్వ, భిక్షపతి పాల్గొన్నారు.